

సచివాలయం, ఆర్‌బికె భవనాల ప్రారంభం


సచివాలయ ప్రారంభోత్సవంలో ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్
మండలంలోని తూర్పుదిగవల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్ర భవనాలను ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తెచ్చిందన్నారు. ప్రజలందరూ సచివాలయం, ఆర్‌బికె సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎవరికి.. ఎర్త్ బెర్త్



రిజర్వుడు స్థానాల్లో అధికార పార్టీ అభ్యర్థుల మార్పు
జనరల్ స్థానాల్లో మార్పులపై వెనక్కి తగ్గినట్లు ప్రచారం
ఏలూరు ఎంపీ స్థానానికి కొత్తముఖం, నరసాపురంపై వీడని ఉత్కంఠ
టిడిపి, జనసేన అభ్యర్థులపై కొనసాగుతున్న అస్పష్టత

ఎన్నికల్లో గెలుపు గుర్రాల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. అధికార వైసిపి ఇప్పటికే పలు మార్పులు, చేర్పులు చేపట్టగా ప్రతిపక్ష పార్టీలు ఇంకా అభ్యర్థులపై ఒక స్పష్టతకు రాని పరిస్థితి కన్పిస్తోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
రిజర్వుడు స్థానాలైన చింతలపూడి, పోలవరం స్థానాల్లో అభ్యర్థులు మార్పు పూర్తి చేసిన వైసిపి, జనరల్ స్థానాల్లో మార్పులకు మాత్రం జంకుతున్నట్లు తెలుస్తోంది. పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజును మార్చాలని వైసిపి నిర్ణయించింది. దీంతో తనకు టికెట్ ఇవ్వకపోతే తన భార్యకు ఇవ్వాలంటూ బాలరాజు చేసిన ప్రయత్నం ఫలించింది. పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తెల్లం బాలరాజు భార్య రాజ్యలక్ష్మిని వైసిపి అధిష్టానం ప్రకటించింది. దీంతో వచ్చే ఎన్నికల్లో తెల్లం రాజ్యలక్ష్మి పోటీలో ఉండనున్నట్లు స్పష్టత వచ్చింది. చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా మార్పు తథ్యమని వైసిపి ఎప్పటి నుంచో సంకేతాలు ఇస్తూ వచ్చింది. చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఏలూరులో రవాణా శాఖాధికారిగా పని చేసిన కంభం విజయరాజు పేరును వైసిపి అధిష్టానం గురువారం రాత్రి ప్రకటించింది. విజయరాజు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు స్వయానా వియ్యంకుడు. మోషేన్‌రాజు లాబీయింగ్‌తోనే జయరాజుకు టికెట్ వచ్చినట్లు చర్చ సాగుతోంది.

రిజర్వుడు స్థానాల్లో వేగంగా అభ్యర్థులను మార్చిన వైసిపి జనరల్ స్థానాల్లో మార్పులకు మాత్రం వెనుకాడుతుందని తెలుస్తోంది. ఆచంట, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు వంటి చోట్ల అభ్యర్థుల మార్పు తథ్యమని తొలుత వైసిపి సంకేతాలు ఇచ్చింది. అక్కడ తగిన అభ్యర్థులు దొరకకపోవడం, మార్పులు తర్వాత వచ్చే వ్యతిరేక సంకేతాలను దృష్టిలో పెట్టుకుని ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. దీంతో పలుస్థానాల్లో అభ్యర్థుల మార్పు ఉంటుందా.. లేదా అనే చర్చ నడుస్తోంది. ముఖ్యంగా ఎంపీ స్థానాలకు అభ్యర్థులు దొరక్క అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని ముందుగానే స్పష్టత ఇచ్చారు. దీంతో ఏలూరు ఎంపీ అభ్యర్థి ఎవరనే చర్చ కొద్దికాలంగా సాగుతోంది. అనుహ్యంగా తణుకు ఎంఎల్ఎ, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్‌ను ఏలూరు ఎంపీ అభ్యర్థిగా వైసిపి గురువారం ప్రకటించింది. ఎంపీ అభ్యర్థిగా ఉండేందుకు సునీల్‌కుమార్ ముందు అయిష్టత వ్యక్తం చేసినా ఖర్చు విషయంలో సగం మాత్రమే పెట్టుకుంటే సరిపోతుందని, మిగిలిన ఖర్చు పార్టీ పెట్టుకుంటుందని భరోసా ఇచ్చి బరిలోకి దించుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక నరసాపురం ఎంపీ స్థానానికి ఎవరు బరిలో ఉంటారో ఇంకా స్పష్టత రాలేదు.

కొలిక్కిరాని టిడిపి, జనసేన అభ్యర్థుల ఎంపిక

ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేన పొత్తుతో ఈ ఎన్నికల్లో పోటీకి దిగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కాపు సామాజిక తరగతి ఎక్కువగా ఉండటంతో జనసేన బలంగా ఉంది. దీంతో జిల్లాలో దాదాపు సగం స్థానాలను జనసేన కోరినట్లు తెలిసింది. ఉంగుటూరు, ఏలూరు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు వంటి పలు స్థానాలను జనసేన అడిగినట్లు చెబుతున్నారు. జనసేనకు ఎన్నిస్థానాలు కేటాయిస్తారో ఇంకా స్పష్టత లేదు. దెందులూరు టిక్కెట్ చింతమనేనికి కాకుండా ఏలూరులో పని చేస్తున్న న్యాయవాదికి ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక రిజర్వుడు స్థానాలు, చింతలపూడి, పోలవరం అభ్యర్థులపైన టిడిపిలో స్పష్టత లేకుండాపోయింది. ముఖ్యంగా ఎంపీ స్థానాల్లో అభ్యర్థులు ఎవరనేది తేలని పరిస్థితి నెలకొంది. దీంతో ఆశావహులు టిక్కెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పెత్తందారుల కాళ్లపై పడలేదనే..!

- మళ్లీ టిక్కెట్ దక్కకపోవడంపై చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా
- కిందేం జరుగుతుందో జగన్‌కు తెలియడం లేదని వ్యాఖ్య
- అమలాపురం ఎంపీ టిక్కెట్ నిరాకరించానని వెల్లడి



ప్రజాశక్తి - చింతలపూడి
పెత్తందార్లు పెత్తనం చేయనియడం లేదనే అక్కసుతోనే కుట్రపూరితంగా తనకు చింతలపూడి టిక్కెట్ రాకుండా అడ్డుకున్నారని చింతలపూడి సిట్టింగ్ ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా ఆవేదన వ్యక్తం చేశారు. దిగువన ఏం జరుగుతుందో సిఎం జగన్‌కు తెలియడం లేదని వ్యాఖ్యానించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ కోటగిరి శ్రీధర్‌, తనకు కొన్ని విబేధాలు ఉన్నాయని, దాన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది కుట్రపూరితంగా వ్యవహరించి, పార్టీ పెద్దల వద్ద తనపై లేనిపోని అసత్య ఆరోపణలు చేశారన్నారు. క్షేత్రస్థాయి నివేదికను తారుమారు చేసి పార్టీ పెద్దలను పక్కదారి పట్టించారన్నారు. ఎలిజాకు టిక్కెట్ ఇస్తే గెలవరు అనే వాదనను ప్రచారంలోకి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ చేసిన సర్వే ప్రకారం 55.8 శాతం ఓటింగ్ తనకు ఉందని, ఆ సర్వే రిపోర్టు తన వద్ద ఉందని తెలిపారు. తాను కొంతమంది పెత్తందారుల కాళ్లపై పడలేదని, ఆత్మగౌరవంతో అంబేద్కర్ కల్పించిన హక్కులను ఉపయోగించుకుని ముందుకున్నానని చెప్పారు. పెత్తందారుల పెత్తనాన్ని అడ్డుకున్నానని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉన్నానని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండటమే తనకు టిక్కెట్ రాకపోవడానికి కారణమన్నారు. తాను ప్రజలకు అందుబాటులో ఉండటంతో పెత్తందారుల పెత్తనం సాగలేదని, దీంతో తనకు టిక్కెట్ రాకుండా అడ్డుకున్నారని అన్నారు. తనకే టిక్కెట్ ఇవ్వాలని సుమారు ఐదొందల మంది నేతలు వంద కార్లలో పార్టీ సమన్వయకర్త మిథున్‌రెడ్డి వద్దకు వెళ్లారని, ఆయనను నేరుగా కలిసే అవకాశం దక్కకపోవడంతో వినతిపత్రం ఇచ్చి వచ్చారని వివరించారు. తనను అమలాపురం ఎంపీగా పోటీ చేయాలని కోరారని, అయితే తాను నిరాకరించానని చెప్పారు.

ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని

వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్
మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ దెందులూరులో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి అని, ఇటీవల ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తున్నట్లు సమన్వయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం పెదవేగి మండలంలోని దుగ్గిరాలలో చింతమనేని కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన టిడిపి నియోజకవర్గ సమన్వయ కమిటీ భేటీ జరిగింది. దీనికి టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, నియోజకవర్గ పరిశీలకులు చెన్నుపాటి గాంధీ, పార్టీ మండల అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు హాజరయ్యారు. పార్టీ లైన్ దాటితే ఎవరినైనా అధిష్టానం ఉపేక్షించదని వారు పేర్కొన్నారు. కనీసం సొంత గ్రామంలోనూ మనుగడ లేని వ్యక్తులు, పార్టీలో సభ్యత్వం లేని వ్యక్తులు కలిసి సమన్వయ కమిటీ సమావేశం అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్లకు పెద్ద జెండాలు కట్టుకుని తిరిగినంత మాత్రాన పెద్ద నాయకులు అయిపోరని వ్యాఖ్యానించారు. వైసిపికి పరోక్షంగా సాయం చేసేలా కొందరు వ్యక్తుల చర్యలున్నాయన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన సదరు వ్యక్తులపై క్రమశిక్షణా చర్యలు కోరుతూ 26 మంది సభ్యుల సమన్వయ కమిటీ తీర్మానం చేసి అధిష్టానానికి నివేదిక పంపుతున్నట్లు వెల్లడించారు. పార్టీ కార్యక్రమాల అమలులో దెందులూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే ఉన్నత స్థానంలో ఉందని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై సీరియస్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నేతలు బొప్పన సుధాకర్, మిల్లు బాబు, నేతల రవి, మోరు శ్రావణి పాల్గొన్నారు.

ఆయన వద్ద పని చేయలేం..!

వ్యవసాయశాఖ జిల్లా అధికారి తీరుపై ఆ శాఖ ఉద్యోగుల ఆవేదన
ఉద్యోగం చేయాలంటే భయమేస్తుందని అధికారుల వద్ద మొర
ఉద్యోగుల ఫిర్యాదుపై కొనసాగుతున్న విచారణ
ఆయన్ని కాపాడేందుకు రంగంలోకి దిగిన ఉద్యోగ సంఘం నేత!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
'ఆయన వేధింపులు తట్టుకోవడం మా వల్ల కాదు.. ఇప్పటికే తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నాం. పలువురు ఉద్యోగులు మెడికల్ సెలవులు పెట్టేశారు. ఉద్యోగులకు రావాల్సిన వేతన సొమ్ము విషయంలో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. బయటికి చెప్పలేని విధంగా బూతులు తిడుతున్నారు. ఉద్యోగం చేయాలంటేనే భయమేస్తోంది. ఇక ఆయనతో పని చేయాలంటే మా వల్ల కాదు.. ఆయన వేధింపుల నుంచి మమ్మల్ని విముక్తి చేయండి' అంటూ జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తీరుపై జిల్లా ఉన్నతాధికారుల వద్ద వ్యవసాయ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు మొరపెట్టుకున్న పరిస్థితి ఉంది. జిల్లా వ్యవసాయాధికారిగా పని చేస్తున్న వై.రామకృష్ణ వ్యవహార శైలిపై ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు తిరుగుబాటు చేశారు. పై అంశాలతో పలువురు ఉద్యోగులు వ్యవసాయశాఖ కమిషనర్‌కు వారంరోజుల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల ఏడో తేదీన 'ప్రజాశక్తి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ కమిషనర్ వ్యవసాయశాఖ జిల్లా అధికారి రామకృష్ణను పిలిచి మాట్లాడినట్లు సమాచారం. జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి సైతం ఉద్యోగులతోనూ, రామకృష్ణతోనూ మాట్లాడినట్లు తెలిసింది. శుక్రవారం రెండో విడత మరోసారి జాయింట్ కలెక్టర్ వద్ద జరిగిన విచారణలో తమ ఆవేదనను ఉద్యోగులు వెళ్లగక్కినట్లు సమాచారం. వ్యవసాయాధికారి రామకృష్ణను ఈ గండం నుంచి గట్టెక్కించేందుకు ఓ ఉద్యోగ సంఘం నేత రంగంలోకి దిగినట్లు తెలిసింది. వ్యవసాయశాఖ ఉద్యోగులతో మాట్లాడుతూ సమస్యను వదిలేయాలని, ఇక నుంచి సదరు అధికారి నుంచి వేధింపులు ఉండవంటూ ఉద్యోగులను శాంతింపజేసే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులతో ఉద్యోగులకు సమస్యలు వస్తే అండగా నిలబడాల్సిన ఉద్యోగ సంఘం నేత వేధింపులకు గురిచేసిన అధికారిని వెనకేసుకురావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇప్పటికే వ్యవసాయశాఖ కమిషనర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేయడం, జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించడం, జాయింట్ కలెక్టర్ వద్ద జరిగిన విచారణలో ఆధారాలతో సహా ఉద్యోగులు తెలిపినట్లు సమాచారం. వ్యవసాయాధికారి రామకృష్ణపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో.. లేదో వేచిచూడాలి.

జూద క్రీడలు అరికట్టాలని ఎస్‌పికి వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, గుండాట అరికట్టాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి ప్రశాంతిమేరీకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రోజుల్లో కోడిపందేలు నిర్వహించడం వల్ల అనేక కుటుంబాలు వీధుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, జూదాలకు ప్రలోభపడి దేశ భవిష్యత్తుకు ఎంతగానో తోడ్పడాల్సిన యువతరం చెడు మార్గాల బాట పట్టి భవిష్యత్తు నాశనం చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాల పరిస్థితులు కూడా పండుగ పూట ఛిన్నాభిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. అందువల్ల సంక్రాంతి సందర్భంగా సంప్రదాయం పేరిట జరిగే కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూదాలను అరికట్టి కుటుంబాల్లో సంక్రాంతి సంతోషాలను నింపేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు దుర్గాప్రసాద్, కె.లెనిన్, సిహెచ్.రాజేశ్వరి, దుర్గ, పి.హైమావతి, ఎ.శ్యామలారాణి, జె.హరీషాదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పండుగ తర్వాత సమ్మె ఉధృతం

అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి


మాట్లాడుతున్న బేబీరాణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
అంగన్వాడీలు ఐక్యంగా, పట్టుదలగా పోరాడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే పండుగ అనంతరం ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి హెచ్చరించారు. అంగన్వాడీ సమ్మె శిబిరాన్ని ఆమె శుక్రవారం సందర్శించి మాట్లాడారు. తొలుత అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రికి కోటి సంతకాల సేకరణ బ్యానర్‌పై ప్రముఖ ప్రజావైద్యులు డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య తొలి సంతకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బేబీరాణి మాట్లాడుతూ అంగన్వాడీలది ఆకలి పోరాటమని, దాన్ని రాజకీయ పోరాటంగా మారకుండా ఉండాలంటే జీతాలు పెంచాల్సిందేనని ఆమె అన్నారు. భోగి మంటల్లో షోకాజ్ నోటీసులను దహనం చేస్తామని, ఈసారి సంక్రాంతి ఇళ్లల్లో కాకుండా వీధుల్లో చేస్తామని హెచ్చరించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ వైద్యం, ఆరోగ్యం బాధ్యత ప్రభుత్వాలదేనని, భావి భారత పౌరులను తయారు చేసే అంగన్వాడీల సమస్యలు చాలా చిన్నవని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షురాలు వి.శైలజ, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బాబూరావు, కట్టా సత్యనారాయణ సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కొర్రి విజయలక్ష్మి, వి.సాయిబాబు, బి.జగన్నాథం, మాణిక్యం, తులసి, స్వప్న, స్వర్ణకుమారి, రజిని, భవాని, బేబీరాణి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అంగన్వాడీలు 32వ రోజు శుక్రవారం సమ్మె కొనసాగించారు. నెల రోజులు దాటినా ఏమాత్రం పోరాట పటిమ తగ్గకుండా పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. నాగమణి, హైమ, సరళ, ఎస్తేరు, వెంకమ్మ పాల్గొన్నారు.

నిడమర్రు: అంగన్వాడీ సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రమణరావు సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. నాయకులు ఎన్.పార్వతి, కె.జయమ్మ, ఆర్.రామలక్ష్మి, నాగమణి, ధనలక్ష్మి, నాగేశ్వరి, వెంకటలక్ష్మి, సుభాషిణి నాయకత్వం వహించారు.

కొయ్యలగూడెం: అంగన్వాడీలు కుర్చీలు తలపై పెట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు, అంగన్వాడీ నేతలు శివ రత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేణి, నాగజ్యోతి పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: అంగన్వాడీల సమ్మెలో భాగంగా నిరసన దీక్ష చేపట్టారు. పద్మజ్యోతి, రమాదేవి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ముసునూరు: స్థానిక సచివాలయం వద్ద అంగన్వాడీలు 32 ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో నేతలు కోరు శ్యామల, బత్రాజు భార్గవి, పల్లిపాము రాజకుమారి, విద్యావతి, మేరీ సులోచన, దుర్గ, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చింతలపూడి: అంగన్వాడీలు గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ అన్నవరపు సత్యనారాయణ కోటి సంతకాల సేకరణను ప్రారంభించగా, రెండో సంతకాన్ని ప్రముఖ ఇంజినీర్ ఆర్నేపల్లి అప్పారావు చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు, నేతలు పి.సరోజిని, జి.సరళ, పద్మ, కె.కవిత, చెన్నకేశ్వరి, ఎం.అరుణ, పాపారత్నం, హేమలత, అంజలి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అంగన్వాడీల సమ్మె కొనసాగింది. దీనిలో నేతలు అన్నమ్మ, అనూరాధ, పుల్లమ్మ, భవాని, రాజ్యలక్ష్మి, జ్యోతి, రూప, కరుణ పాల్గొన్నారు.

కలిదిండి: అంగన్వాడీలు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఒబిసి నాయకులు లావేటి వీర శివాజీ సమ్మెకు మద్దతు తెలిపారు. నేతలు షేక్ అబిదాబేగం, జక్కంశెట్టి మేనకలక్ష్మి, కొప్పినీడి రమాదేవి, సత్యవతి, వెంకటలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

పోలవరం: అంగన్వాడీల సమ్మెకు యుటిఎఫ్, ఎస్‌టియు నేతలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు శ్రీనివాస శాస్త్రి, లక్ష్మయ్య, పోసిబాబు, ఎస్‌టియు నాయకులు రామారావు, సిఐటియు మండల కార్యదర్శి పి ఎల్ ఎస్ కుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మండవల్లి: అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో నేతలు చెల్లాయమ్మ, వాణి, ఉమాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చాట్రాయి: అంగన్వాడీల సమ్మె శిబిరం కొనసాగింది. కార్యక్రమానికి కళ్యాణి శివకుమారి, జమలమ్మ, నాగేశ్వరమ్మ, నాయకత్వం వహించారు.

అంగన్వాడీల డిమాండ్లు న్యాయమైనవి

సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన అఖిలపక్షం


మాట్లాడుతున్న రవి, హాజరైన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
అంగన్వాడీల డిమాండ్లు న్యాయమైనవని, ప్రభుత్వం సానుకూల దృక్పథంతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షత వహించారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, టిడిపి నేత, మాజీ డిప్యూటీ మేయర్ వెంకటరత్నంనాయుడు, జనసేన నగర అధ్యక్షులు కాశీ నరేష్‌బాబు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బద్ద వెంకట్రావు, బిఎస్‌పి నాయకులు నేతల రమేష్‌బాబు, ఆమ్‌ఆద్మీ నియోజవర్గ కన్వీనర్ షేక్ మస్తాన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమస్యలు పరిష్కరించకుండా ఎస్మాను ప్రయోగించడాన్ని ఖండించారు. వెంటనే ఎస్మాను ఉపసంహరించి, అంగన్వాడీలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్షంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కోటి సంతకాల సేకరణలో అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, అంగన్వాడీ నేతలు స్వర్ణ, స్వప్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ, చేతివృత్తిదారుల జిల్లా కార్యదర్శి పి.ఆదిశేషు, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎం.ఇస్సాక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కాకి నాని, క్రాంతి, జనసేన నాయకులు లక్ష్మణరావు, ఆమ్‌ఆద్మీ నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: అంగన్వాడీలకు మద్దతుగా అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పుష్ప అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, టిడిపి నాయకులు సున్నం నాగేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకష్ణ, కాంగ్రెస్ నాయకులు పోతురాజు, తగరం బాబురావు, సిపిఐ మండల కార్యదర్శి కారం దారయ్య మాట్లాడారు. సమస్యలను సంబంధిత సంఘాలతో చర్చించి సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో రామలక్ష్మి, కృపామణి, మారమ్మ, ఆకాశమ్మ, ఎ.ఫ్రాన్సిస్, తామా ముత్యాలమ్మ, వినోద్, శ్రీనివాస్, శ్రీను పాల్గొని మద్దతు తెలిపారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు




హరిదాసులతో మేయర్ దంపతులు, కమిషనర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్
ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సంక్రాంతి శోభ ఉట్టిపడేలా కన్నుల పండువగా నిర్వహించారు. నగరమేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యాలయ ఆవరణలో గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కల వాళ్లు వాయిద్యాలను వాయిస్తూ సందడి చేశారు. మెప్మా సిబ్బంది పాయసం అరిసెలు, సున్నుండలు ఇతర పిండి వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందర్నీ ఆకర్షించింది. కార్యాలయ ఆవరణ మొత్తాన్ని ఉద్యోగులు రంగవల్లులతో నింపేశారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. 'ఐ లవ్ ఏలూరు' వాటర్ ఫౌంటేన్‌ను మేయర్ షేక్ నూర్జహాన్ ప్రారంభించారు. తొలుత కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సంక్రాంతి లక్ష్మికి మేయర్ దంపతులు పూజలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను నగర ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. అందరి ఇళ్లు సిరి సంపదలతో నిండాలని ఆకాంక్షించారు. కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఏలూరును సుందర నగరంగా తీర్చిదిద్దడానికి అంతా సహకరించాలని కోరారు. తొలుత భోగి మంటను మేయర్ దంపతులు వెలిగించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, అదనపు కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ రాధ పాల్గొన్నారు.

సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగు నింపాలి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ


గంగిరెద్దుతో జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు

ప్రజాశక్తి - ఏలూరు
సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగు నింపాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, అధికారులు, కార్యాలయ సిబ్బందితో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ హాజర య్యారు. సిబ్బంది ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు, భోగి మంటలు, భోగి పళ్లు, గంగిరెడ్లు, హరిదాసు, సంక్రాంతి పిండి వంటలు, తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా దుస్తులు, బాలలచే నృత్య రూపకాలను జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీప్రసాద్ తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. కార్యాలయ సిబ్బంది ఐక్యతతో ప్రజలకు మరిన్ని ప్రభుత్వ సేవలందించేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో, సంక్రాంతి వంటకాల్లో గెలుపొందిన వారికి ఛైర్‌పర్సన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఎన్.నిర్మలాజ్యోతి, కేదారేశ్వరరావు, జి.శ్రీధర్‌రాజు, సిహెచ్.గోపాలకృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

'మానవ సేవే మాధవ సేవ'

ప్రజాశక్తి - చింతలపూడి

మానవసేవే మాధవ సేవ అని ఏరియా కమ్యూనిటీ ప్రభుత్వ హాస్పిటల్ సూపరిడెంట్ ఎస్.కె.హఫీజా, నగర పంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు అన్నారు. చింతలపూడి పట్టణం కొవ్వూరుగూడెంకు చెందిన నాగదేసి థెరిస్సా రిటైర్డ్ టీచర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పది పడకలకు కావల్సిన బెడ్ షీట్స్, కరెంటు లేని సమయంలో ఆపరేషన్ థియేటర్‌లో ఉపయోగపడే లైట్‌ను ఏరియా ఆసుపత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు కాంతారావు, మున్సిపల్ కమిషనర్ రాంబాబు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన తెల్పుతున్న టిడిపి నాయకులు

మోకాళ్లపై నిల్చొని టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి - ఉంగుటూరు

జగన్ ప్రభుత్వం ఎస్‌సిలకు ఏమి ఉద్ధరించారో శ్వేత పత్రం విడుదల చేయాలని టిడిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు నేకూరి ఆశీర్వాదం అన్నారు. శుక్రవారం కాగుపాడులో అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టిలకు పెద్ద మేనమామ అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి ఎస్‌సిలపై అనేక విధాలుగా దాడులు, కేసులతో అవమానించి ఇప్పుడు విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏమోహం పెట్టుకుని ఆవిష్కరిస్తారని ప్రశ్నిస్తూ కాగుపాడులో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంటా యువరాజు, కాంతారావు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సంక్రాంతి పండగను పురస్కరించుకొని కోడిపందెలు, పేకాట, గుండాట వంటి జూదాలుకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. మండలంలోని చిన్నాగిరిపల్లి, తోటపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోడిపందెల బరులను సిబ్బందితో కలిసి ధ్వంసం చేశారు.

పోలవరం : కోడి పందెలు, జూదం, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిషేధించడం జరిగిందని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు హెచ్చరించారు. పోలవరం మండలం కొత్త పట్టిసీమ, పాత పట్టిసీమ పంచాయతీ పరిధిలో తహాశీల్దార్ బి.సుమతి అధ్యక్షతన జూదం ఆడటం వల్ల జరుగు నష్టాలను ప్రజలకు వివరిస్తూ శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ బి.సుమతి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : రాబోవు సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలో ఎవరైనా ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ డి.వెంకట్ కుమార్ అన్నారు. మండలంలోని వైవాక గ్రామంలో శుక్రవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆటల పోటీలు

ఏలూరు అర్బన్ : డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంక్రాంతి యువజన ఉత్సవాలు ఈనెల 13 నుంచి ఏలూరులో ప్రారంభమవుతున్నాయని ఆ సంఘాల నాయకులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఐద్వా ఆఫీసులో మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు బి.హైమావతి అధ్యక్షతన విద్యార్థి యువజన మహిళా సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, జిల్లా అధ్యక్షుడు ఠాగూర్ రాజా, ఏలూరు డివైఎఫ్ఐ అధ్యక్షులు దుర్గాప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు అన్నీ కలిపి సంక్రాంతి ఆటల పోటీలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఏలూరు నగరంలోనే 30 కేంద్రాల్లో వివిధ వార్డుల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దానిలో భాగంగా శనివారం ఉదయం పవర్ పేటలోని ప్రజాసంఘాల ఆఫీసులో జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ ప్రారంభం అవుతున్నాయని వారు తెలిపారు. ఈ పోటీలను ఏలూరు ఎంఆర్ఒ సోమశేఖర్ ప్రారంభిస్తారన్నారు. చెస్ ప్లేయర్స్ అంతా ఈ పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పనులు చూపాలని వినతి

ఏలూరు అర్బన్ : వ్యవసాయ పనులపై ఆధారపడి జీవిస్తున్న గ్రామీణ పేదలు, కూలీలు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు రెవెన్యూ అధికారికి వినతిని సమర్పించారు. శుక్రవారం బికెఎంయు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే వసంతరావు డిఆర్‌ఒను కలిసి వినతిని సమర్పించారు. ఉపాధి లేని గ్రామీణ పేదలు వలసలు పోకుండా జాబు కార్డులతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు ఉపాధి హామీ చట్టం ద్వారా కల్పించి రోజు కూలీ రూ.600 ఇచ్చే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

క్యాంపు కార్యాలయంలో 'జయహో బిసి'

బుట్టాయగూడెం : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మండల స్థాయి 'జయహో బిసి' సమావేశం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి శీలం వేంకటేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శేషు, బిసి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండపల్లి రవి, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు డోకల నాగేశ్వరరావు, పోలవరం మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రెడ్డి పాలనలో బిసిలను అణచివేస్తున్నారన్నారు. వైసిపి పాలనలో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పూర్తి స్థాయిలో బిసిలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల బిసి సెల్ అధ్యక్షులు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సరిహద్దు గుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు

జీలుగుమిల్లి : ఆంధ్రా, తెలంగాణా సరిహద్దు ప్రాంతాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం మండలంలోని తాటియాకులగూడెం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల గుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, ఎస్ఇబి ఎస్ఐ మస్తానయ్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని మహిళకు గాయాలు

నూజివీడు రూరల్ : మండలంలోని హనుమంతుల గూడెం గ్రామంలో శుక్రవారం వేగంగా వచ్చిన లారీ మహిళను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. రాజస్థాన్ నుంచి కోళ్ల మేతతో గుడివాడ వెళుతున్న లారీ గ్రామంలో అదుపుతప్పి బాణావతి జ్యోతి(45) అనే మహిళను ఢీకొట్టడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 వాహనంలో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యులు చికిత్స చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

జీలుగుమిల్లి : మండలంలోని తాటియాకుల గూడెం అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణా రాష్ట్రం నుంచి ఆంధ్రాకు తరలిస్తున్న రెండు ఫుల్ మద్యం బాటిళ్లను పట్టుకోవడం జరిగిందని హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మండలంలోని తాటియాకుల గూడెం ఎస్ఇబి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం ఎస్ఇబిఎస్ఐ మస్తానయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణా నుంచి ఆంధ్రాకు కార్‌లో తరలిస్తున్న 12 మద్యం బాటిళ్లను పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

సంక్రాంతికి పందెం కోళ్లు రెఢీ

- వారం రోజుల నుంచే పందెం బరులు రెడీ చేస్తున్న పందెంరాయుళ్లు, నిర్వాహకులు
- రూ.లక్షల్లో పలుకుతున్న పందెం పుంజులు
- కోర్టు తీర్పులు, అధికారుల హెచ్చరికలు భేఖారత్
- ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకుల ఒత్తిడితో ఆంక్షలు ఎత్తివేస్తారని ప్రచారం

ప్రజాశక్తి - ముసునూరు

భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ ఈ నాలుగు రోజులు పండుగ వాతవరణం పేరుతో పందెం నిర్వాహకులు లక్షల్లో వ్యాపారం చేసి డబ్బు సంపాదించవచ్చని ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంక్రాంతి పండుగ దగ్గరపడుతుండటంతో పందెం రాయుళ్ళ అమ్మకాలు, కొనుగోళ్ల రూ.లక్షల్లో ఇప్పటి నుంచే చేతులు మారుతున్నాయి. నెమిలి, కాకి, కాకి డేగ, ఆబ్రాసు, రసంగి, సీతువ, పూల పర్ల, కెక్కిరాయి వంటి పలు జాతి పుంజులను బాదం పప్పు, పిస్తా,



గోపవరంలో పందెం జరుగుతున్న పందెం పుంజులు

జీడిపప్పు, మటన్ కైమా, తాటి బెల్లం, నల్లనువ్వులు, ఎండుద్రాక్ష, ఎండుకర్జూరం, సోంపు, అంజురాలతో కలిపి వుండలగాను, పొడిగాను ఆహారంగా అందిస్తున్నారు.

పందెం పుంజులకు ప్రత్యేక ఆహారం పెడుతూ, ప్రత్యేక షెడ్యూల్లో ఎండ తగలకుండా, గాలి వాతావరణం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పందేల్లో కోడికత్తుల తయారీలో వాళ్ల హవా బరిని బట్టి కొనసాగుతూ వుంటుంది. పండుగ దగ్గర పడటంతో కోడి కత్తుల తయారీలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, పందెం రేటును బట్టి, పుంజును బట్టి కత్తులు కట్టడానికి సిద్దంగా వున్నారు. హైకోర్టు ఉత్తర్వులు బట్టి జిల్లా, డివిజన్, మండల స్థాయి నాయకులు పండుగరోజు వచ్చేవరకు ప్రతి ఏటా లాగానే ఈ సంవత్సరం కూడా ఆంక్షలు వున్నాయంటూ హడావుడి చేయడం తప్ప చివరికి పందెం నిర్వహకుల మాటే గెలుస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు.

జిల్లా ఎస్‌పి నుంచి పోలీస్ శాఖాధికారులు,



ఆబ్రాసు..

మండల, రెవెన్యూ అధికారులు కోడి పందెలు, పేకాట, గుండాట, జూదంలాంటి ఆటలు ఆడినా, ఆడించిన వారిపై కఠిన చర్యలు తప్పవని పత్రికా ముఖంగా హెచ్చరించడం షరా మామూలే.. అయితే



కోడి పందేలపై హెచ్చరికలు జారీ చేస్తున్న సిఐ, ఎస్ఐ

సంక్రాంతి పండుగకు మిగిలింది ఒక్కరోజు కావున అధికారులు ఏం చేస్తారో వేచి చుద్దాం.

ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కోర్టు ప్రాంగణం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న లాయర్లకు సిపిఎం జిల్లా నాయకులు శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్ మద్దతుగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వైసిపి ప్రభుత్వం ఇక్కడ పరిపాలన చేస్తుందని విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆదేశించిన వెంటనే నీతి అయోగ్ సిఫార్సుల మేరకు రాష్ట్రంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రభుత్వం తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. దీనివల్ల ఒక న్యాయవాదులే కాదని, రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలియజేశారు. ఇప్పటికే అనేక భూ తగాదాలు రెవిన్యూ డిపార్ట్మెంట్ సక్రమంగా వ్యవహరించకపోవడం వల్ల పెండింగ్‌లో ఉన్నాయని, తాజాగా



ఏలూరులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

తీసుకొచ్చిన చట్టం వల్ల ఇవి మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేకమైన ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.ఇస్సాక్, కె.లెనిన్ పాల్గొన్నారు. అనంతరం సిపిఎం నాయకులు అడ్వకేట్స్‌కు నిమ్మరసం ఇచ్చి ఈరోజు దీక్షలు విరవింపజేశారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని కోర్టు భవనాల వద్ద ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు కోరుతూ న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి మధు రవిశంకర్ మాట్లాడుతూ ఈ చట్టంతో సామాన్యులు తీవ్రమైన నష్టాలు ఎదుర్కొంటారన్నారు. చట్టం రద్దయ్యేంత వరకు నిరసన దీక్ష కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, రాఘవులు, స్వామి పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పోలవరం

కొత్త పట్టిసీమ గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, పచ్చని తోరణాలు, హరిదాసు కీర్తనలు, ముగ్గుల పోటీలు, సాంప్రదాయ దుస్తులతో, మధ్యాహ్నం భోజనాలు, ఆటలు, విజేతలకు బహుమతులు వంటి కార్యక్రమాలతో ముందుగానే కొత్త పట్టిసీమలో సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో సర్పంచి మైగాపుల విజయదుర్గ, ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, తహాశీల్దార్ బి.సుమతి, వలవల వరలక్ష్మి, సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, సెక్రటరీ టి.విజయ్ కుమారి, సొసైటీ అధ్యక్షులు సాయిబాబా, వైస్ సర్పంచి రంభ వాసు, వలవల బాలాజీ, మహిళలు, పిల్లలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని సంక్రాంతి సందడి చేశారు.



పట్టిసీమలో సంక్రాంతి సంబరాలు

ఉంగుటూరు : జనసేన ఆధ్వర్యంలో 'మన ఊరు-మన ఆట' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని నల్లమాడు గ్రామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉంగుటూరు నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు పాల్గొని ముగ్గుల పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పంది రాంబాబు, నల్లమాడు ఉప సర్పంచి, జనసేన నాయకులు పాల్గొన్నారు

బుట్టాయగూడెం : మండలంలోని కామవరం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలు వాలీబాల్ టోర్నమెంటును సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ సీనియర్ నాయకులు ధర్ముల సురేష్ ప్రారంభించారు. ఈ వాలీబాల్ టోర్నమెంటుకు 16 టీంలు వచ్చాయన్నారు. మొదటి బహుమతికి రూ.25వేలు, రెండవ బహుమతికి రూ.15వేలు ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. ఈ ఆటల పోటీల కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న, స్థానిక సర్పంచి కొరస గంగరాజు పాల్గొన్నారు.

ఆటలు యువతకు ఉత్తేజాన్నిస్తాయి

మండవల్లి : ఆటలు యువతకు ఎంతో ఉత్తేజానిస్తాయని ఇన్‌ఛార్జి ఎండిఒ ఆనందబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మండల లెవెల్ ఆటలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భైరవ పట్టణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ ఆటలను ఆయన టాస్ వేసి ప్రారంభించారు. ఫైనల్స్‌కు చేరుకున్న టీంలకు శుక్రవారం ఫైనల్ ఆటలను నిర్వహించామన్నారు. ఈ ఆటలను పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మన బోయిన గోకర్ణ యాదవ్, సర్పంచి మెండ జాన్సీ వీక్షించారు.

ఆగిరిపల్లి : మండల పరిధిలోని 19 సచివాలయాల పరిధిలో గత మూడు రోజులుగా ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న మండలస్థాయి ఆడుదాం-ఆంధ్రా క్రికెట్ పోటీల్లో శుక్రవారం జరిగిన ఫైనల్‌లో కొత్త ఈదర సచివాలయ జట్టుపై నూగొండపల్లి సచివాలయ జట్టు ఘన విజయం సాధించింది. మండల స్థాయిలో విజయం సాధించిన జట్లు నియోజకవర్గస్థాయిలో తలపడతాయని ఇఒపిఆర్‌డి సిహెచ్.శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, సంగమయ్య పాల్గొన్నారు.

ముదినేపల్లి : యువత విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముదినేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యమానికి శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం

జీలుగుమిల్లి : పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపిపి కొర్శ పోసమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని పి.రాజవరం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో ముందంజ

ఏలూరు టౌన్ : స్వచ్ఛ సర్వెక్షన్ 2023లో ఏలూరు కార్పొరేషన్ మెరుగైన పనితీరు కనపరిచింది. మొట్టమొదటి సారిగా ఏలూరు నగరం ఒడిఎఫ్‌ం సాధించింది. స్వచ్ఛ సర్వేక్షన్ గత ఫలితాలతో పోలిస్తే 2023లో ఏలూరు నగరం 100 స్థానాలకు పైబడి ముందుకు వెళ్ళింది. జాతీయ స్థాయిలో ఇంతకుముందు సంవత్సరం మన ర్యాంక్ 325 ఇప్పుడు మన నగర ర్యాంకు 223. అదేవిధంగా రాష్ట్రంలో లక్షకు పైబడిన 32 నగరాల్లో ఏలూరు నగరానికి గతంలో స్థానం 25 ఇప్పుడు మన స్థానం 12. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో ప్రజల మన్ననలను పొందటంలో ఏలూరు 2023 సంవత్సరంలో చాలా గణనీయమైన, మెరుగైన ఫలితాలను పొందింది. పారిశుధ్య పనులు, శానిటేషన్‌లతో ఇది సాధ్యమైందని కమిషనర్ వెంకటకృష్ణ తెలిపారు.

'జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా'

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గానికి నూతన సమన్వయకర్తగా నియమించిన సిఎం జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయరాజు అన్నారు. లింగపాలెం మండలంలో సత్యనారాయణ స్వామి దేవాలయాన్ని ఆయన శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ర్యాలీగా మద్ది అంజనేయ స్వామి ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఒక్క కార్యకర్తను కలుపుకొని ముందుకు తీసుకెళ్తామన్నారు. నియోజవర్గం వర్గ విభేదాలు అన్ని సమన్వయపరిచి పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. వైనాట్ 175లో భాగంగా మా నియోజకవర్గాన్ని సిఎంకి కానుకగా ఇస్తామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

ఏలూరు టౌన్ : పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రతని, ఫ్రైడే డ్రైడే ఆచరించడం వలన అంటువ్యాధులు మన దరి చేరవని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు లంకపేట ఒకటవ వీధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మనకి ఎక్కువగా అనారోగ్య సమస్యలు అపరిశుభ్రత వల్ల సంక్రమిస్తాయని తెలిపారు. ముఖ్యంగా అపరిశుభ్ర పరిసరాల వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. అనంతరం కొత్తపేట అర్బన్ పిహెచ్‌సి సిబ్బందితో జగనన్న ఆరోగ్య సురక్ష రివ్యూ మీటింగ్ వైద్యాధికారి డాక్టర్ అనీషా ఆధ్వర్యంలో నిర్వహించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఘనంగా జాతీయ యువజనోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని, ఆయన సిద్ధాంతాలు యువతను సన్మార్గంలో నడిపింపజేసేలా స్ఫూర్తిదాయకంగా ఉంటాయన్నారు. ఆయన జయంతిని ప్రతి ఏటా జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్ కె.వరప్రసాదరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి సీతారాం, జి.జ్ఞానవేణి, సిహెచ్.అనూష, డి.శిరీష, ఎన్.విజయ, కెవి.రమణ పాల్గొన్నారు.

హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరు వైఎమ్‌హెచ్ఎ హాలులో స్వామి వివేకానంద జయంతిని, జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు పూలమాలవేసి స్మరించుకున్నారు.

భూములకు హక్కు పత్రాలివ్వాలి

ఏలూరు అర్బన్ : నూజివీడు ప్రాంతంలో పేదల సాగులో ఉన్న రూ.10 వేల ఎకరాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హక్కు పత్రాలను అందజేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వన సంరక్షణ సమితిలకు కేటాయించిన భూములను విఎస్ఎస్ సభ్యులకు వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలన్నారు.